క్లుప్తంగా

మండల మీట్ రేపు

వెదురుకుప్పం: మండల సాధారణ సర్వసభ్య సమావేశం శుక్రవారం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ సుధాకరరావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండల పరిషత్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో నిర్వహించే సమావేశానికి ప్రజాప్రతినిధులతో పాటు అన్ని శాఖల అధికారులు తప్పకుండా హాజరు కావాలని ఆయన కోరారు.

పనుల పరిశీలన



వాటర్ పైపులైన్ మరమ్మతు పనులను పరిశీలిస్తున్న కమిషనర్

పుత్తూరు రూరల్: స్థానిక శ్మశాన వాటికలో నిర్మిస్తున్న ప్రహరీ గోడ నిర్మాణ పనులను బుధవారం మున్సిపల్ కమిషనర్ కేఎల్ఎన్‌రెడ్డి పరిశీలించారు. రూ.24 లక్షల వ్యయంతో నిర్మిస్తున్న ప్రహరీ పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. అనంతరం ఎన్జీఓ కాలనీలో జరుగుతున్న తాగునీటి ప్రధాన పైపులైన్ మరమ్మతు పనులను పరిశీలించారు. శ్రీరంగం చెరువు వైపు వెళ్లే మార్గంలో వేసిన మట్టి దిబ్బలను తొలగించాలని ఆయా ఇంటి యజమానులను ఆదేశించారు.

వైభవంగా గోపూజ



గోపూజ చేస్తున్న ఆర్యవైశ్యులు

నగరి: పట్టణంలోని సత్రం దక్షిణవీధిలో ఉన్న వాసవీ కన్యకాపరమేశ్వరి దేవాలయ జీర్ణోద్ధరణ అష్టబంధన మహాకుంభాభిషేక ఉత్సవాల్లో భాగంగా బుధవారం గోపూజ కార్యక్రమం వైభవంగా నిర్వహించారు. గోపూజ అనంతరం ధన పూజ, అంకురార్పణ, రక్షాబంధనం, మహాసంకల్ప పూజలు నిర్వహించి పూర్ణాహుతి చేశారు. భక్తులకు ప్రసాదాలు పంపిణీ చేశారు.ఆర్యవైశ్యులు అధికసంఖ్యలో ఈ పూజల్లో పాల్గొన్నారు. ఆలయ అధ్యక్షుడు రవీంద్రబాబు గుప్త ఏర్పాట్లను పర్యవేక్షించారు.

కుతూహలమ్మకు నివాళి



కుతూహలమ్మ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు

గంగాధరనెల్లూరు: పలువురు నేతలు బుధవారం మాజీమంత్రి డాక్టర్ గుమ్మడి కుతూహలమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి, నివాళులర్పించారు. మండలంలోని వింజం లక్ష్మీరెడ్డిపల్లెలో కుతూహలమ్మ శుభస్వీకరణ కార్యక్రమం జరిగింది. పార్టీల కతీతంగా పలువురు నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు. కుతూహలమ్మ చిన్నకుమారుడు హరికృష్ణ పిండ ప్రదానం చేశారు. జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు, వేపంజేరి మాజీ ఎమ్మెల్యే గాంధీతో పాటు పలువురు నేతలు కుటుంబసభ్యుల్ని పరామర్శించారు.

నైపుణ్యం వెలికితీయాలి

గుడిపాల: విద్యార్థుల్లో నైపుణ్యతను వెలికితీయాలని ఎంఈవో రామ్‌నాయక్ తెలిపారు. మండలంలోని తిమ్మయ్యపల్లె పాఠశాలను బుధవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థులతో కొంతసేపు ముచ్చటించి ఉపాధ్యాయులు సరిగ్గా పాఠాలు చెబుతున్నారా లేదా అన్న విషయాన్ని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం విద్యార్థులకు కొన్ని ప్రశ్నలు వేసి రాబట్టారు. ఉపాధ్యాయుల హాజరు పట్టిక పుస్తకాలను తనిఖీ చేశారు. మెనూ ప్రకారం భోజనం పెడుతున్నారా లేదా అని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు.

గృహసారథులే పార్టీకి విజయసారథులు

- డిప్యూటీ సీఎం నారాయణస్వామి



మాట్లాడుతున్న ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి

పెనుమూరు(కార్వేటినగరం): నేటి గృహసారథులే రేపటి వైఎస్సార్ సీపీ విజయ సారథులని డిప్యూటీ సీఎం నారాయణస్వామి అన్నారు. మండల కేంద్రంలోని బుధవారం ఓ ప్రైవేటు కల్యాణ మండపంలో ఏర్పాటు చేసిన గృహసారథులు, సచివాలయ కన్వీనర్ల శిక్షణ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొని, ప్రసంగించారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను లబ్ధిదారులకు మరింత చేరువుగా అందించడమే లక్ష్యంగా గృహసారథులు పని చేయాలని పిలుపునిచ్చారు. గత టీడీపీ ప్రభుత్వం చంద్రబాబు ప్రజలకు చేసిన అన్యాయాన్ని, వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేపడుతున్న సంక్షేమ పథకాల మధ్య తేడాలను వివరించాలని సూచించారు. పెనుమూరు మండలాన్ని అన్నివిధాల అభివృద్ధి చేశామని, రూ.197 కోట్లతో ఎన్టీఆర్ జలాశయం అభివృద్ధి, 50 పడకల ఆస్పత్రి, టీటీడీ కల్యాణ మండపం నిర్మాణం, కనిగిరి వేంకటేశ్వరస్వామి ఆలయాన్ని టీటీడీలో విలీనం ఘనత జగనన్న ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. అనంతరం మండలంలోని మిట్టూరు గ్రామానికి చెందిన టీడీపీ నాయకుడు రఘపతినాయుడు మాట్లాడుతూ ఒక రైతు బిడ్డగా అమరావతిలో రైతుల భూములను బలవంతంగా లాక్కొని, రైతులను మోసం చేసి, నేడు ఫేక్ రైతుల ద్వారా ర్యాలీ చేయిస్తున్న ఘనత చంద్రబాబుకే దక్కుతుందన్నారు. నేడు జగన్‌మోహన్‌రెడ్డి రైతులకు పెద్దపీట వేసి ఆర్బీకేల ద్వారా సబ్సిడీ మందులు, విత్తనాల సరఫరా, రైతు భరోసా, జలకళ తదితర పథకాలు అమలు చేసిన ఘనత జగనన్నకే దక్కుతుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ బండి కమలాకర్‌రెడ్డి, నియోజకవర్గం మహిళా అధ్యక్షురాలు యశోదారెడ్డి, యువజ విభాగం జిల్లా ప్రధాన కార్యదర్శి విజయకుమార్‌రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి దూదిమోహన్, నాయకులు కృష్ణారెడ్డి, రాజారెడ్డి, నవీన్‌కుమార్‌రెడ్డి, దాము, రమేష్, మనోహర్, మహేష్, మురళి పాల్గొన్నారు.



పనులను పరిశీలిస్తున్న డిప్యూటీ సీఎం

షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణ పనుల పరిశీలన

వెదురుకుప్పం: మండల కేంద్రంలో నిర్మిస్తున్న షాపింగ్ కాంప్లెక్స్ పనులను బుధవారం సాయంత్రం డిప్యూటీ సీం నారాయణస్వామి పరిశీలించారు. షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణానికి ఉప ముఖ్యమంత్రి చొరవతో రూ.50 లక్షలు మంజూరు చేయించారు. స్థానిక సర్పంచ్ శిల్ప, ఏఎంసీ మాజీ ఉపాధ్యక్షుడు రామయ్య ఆధ్వర్యంలో పనులు శరవేగంగా జరుగుతున్నాయి. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ పనులు త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. షాపింగ్ కాంప్లెక్స్ పైన కూడా గదుల నిర్మాణానికి మరో రూ.50 లక్షలు మంజూరు చేయిస్తానని చెప్పారు. మంత్రి వెంట వైఎస్సార్‌సీపీ బీసీ సెల్ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి బట్టి సుబ్రమణ్యం, జిల్లా ప్రధాన కార్యదర్శి పద్మనాభరెడ్డి, మండల కన్వీనర్ ధనంజయరెడ్డి, సర్పంచ్‌ల సంఘం మాజీ అధ్యక్షుడు ఈశ్వరరెడ్డి, మాజీ సర్పంచ్ పెద్దిరెడ్డి ఉన్నారు.

స్త్రీనిధితో సత్వర రుణాలు



మాట్లాడుతున్న ఫరీద్ మస్తాన్

పాలసముద్రం: డ్వాక్రా మహిళలు స్త్రీనిధి ద్వారా సత్వర రుణాలు పొందవచ్చని ఐకేపీ ఏపీఎం ఫరీద్ మస్తాన్ తెలిపారు. బుధవారం ఐకేపీ కార్యాలయంలో డ్వాక్రా సంఘాల లీడర్లు, సంఘమిత్రలు, వీఓ లీడర్లు, సీసీలతో ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. ఏపీఎం మాట్లాడుతూ ప్రభుత్వం డ్వాక్రా మహిళలకు మరిన్ని ఎక్కువ రుణాలు అందించేలా స్త్రీనిధి సంస్థను మెరుగుపరిచే బాధ్యత మహిళలపై ఉందన్నారు. మహిళల ఆర్థికాభివృద్ధికి ఏర్పాటు చేసిన స్త్రీనిధి సంస్థకు పూర్తిస్థాయి యజమానులు మహిళలేనని తెలిపారు. బ్యాంకు లింకేజీల ద్వారా అందిస్తున్న వడ్డీలేని రుణాలను సంఘ సభ్యులు సద్వినియోగం చేసుకుని అభివృద్ధి చెందాలన్నారు. కార్యక్రమంలో సీసీ చిరంజీవి, సంఘమిత్రలు మురగయ్య, బాలయ్య, మంజుల తదితరులు పాల్గొన్నారు.

సాయిబాబాకు ప్రత్యేక పూజలు

కార్వేటినగరం: మండల కేంద్రంలోని బాలాజీ నగర్‌లో ఉన్న షిరిడీ సాయిబాబా మందిరంలో గురువారం ప్రత్యేక పూజలు చేశారు. అర్చకులు రావూరి రవి ఉదయం బాబా మూల విరాట్‌కు పాలాభిషేకం చేశారు. అనంతరం బాబాకు విశేషాలంకరణ చేసి, భక్తులకు దర్శనం కల్పించారు. బాబా మందిరం అధ్యక్షుడు బాలాజీ భక్తులకు తీర్థ ప్రసాదాలను పంచిపెట్టారు. రాత్రి బాబా ఉత్సమూర్తిని పల్లకిలో కొలువుదీర్చి ఊరేగించారు. భక్తులు ఇంటింటా కర్పూర హారతులు పట్టి, మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం కాగడ హారతి సమర్పించి ఏకాంత సేవతో పవళింపజేశారు.

గాలికుంటు వ్యాధి నివారణకు టీకా తప్పనిసరి



పశువులకు టీకాలు వేస్తున్న పశువైద్యాధికారి

శ్రీరంగరాజపురం: పాడిపశువులకు సోకే గాలికుంటు వ్యాధి నివారణకు టీకాలు తప్పనిసరి అని పశువైద్యాధికారి డాక్టర్ కేపీ శ్రీవిద్య అన్నారు. మండలంలోని చిన్న తయ్యూరులో బుధవారం జాతీయ పశువ్యాధి నియంత్రణ వారోత్సవాల్లో భాగంగా పాడి పశువులకు గాలికుంటు వ్యాధి నివారణకు టీకాల కార్యక్రమం ప్రారంభించారు. ఈ సందర్భంగా వైద్యాధికారి మాట్లాడుతూ పశువులకు వ్యాపించే ప్రాణాంతకమైన వ్యాధుల్లో గాలికుంటు వ్యాధి ఒక్కటని సూచించారు. ప్రతి ఒక్కరూ గాలికుంటు వ్యాధి నియంత్రణ టీకాలను సద్వినియోగం చేసుకుని పశువులను కాపాడుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. గాలికుంటు వ్యాధి టీకాలపై పాడి రైతులు అపోహలను వీడి ముందుకు రావాలని సూచించారు. అనంతరం 92 పాడిపశువులకు గాలికుంటు వ్యాధి టీకాలు వేశారు. ఈ కార్యక్రమంలో పశువైద్య సిబ్బంది, గోపాల మిత్రలు, పాడి రైతులు పలువురు పాల్గొన్నారు.

ఘనంగా స్టాలిన్ జన్మదిన వేడుకలు



విద్యార్థులకు అభ్యసన సామగ్రి అందజేస్తున్న డీఎంకే నాయకులు

నగరి: మున్సిపాలిటీలోని ఏకాంబరకుప్పంలో డీఎంకే పార్టీ నాయకులు తమిళనాడు ముఖ్యమంత్రి స్టాలిన్ జన్మదిన వేడుకలు బుధవారం ఘనంగా నిర్వహించారు. డీఎంకే నాయకుడు వీవీ లోకనాథన్ ఆధ్వర్యంలో స్థానిక అన్నాదొరై విగ్రహానికి పూలదండలు వేసి, పలువురికి అన్నదానం చేశారు. అనంతరం జెడ్పీ ఉన్నత పాఠశాలలోని విద్యార్థులకు అభ్యసన సామగ్రిని వితరణ చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక డీఎంకే నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మయూర వాహనంపై సుబ్రమణ్యేశ్వరస్వామి



మయూర వాహనంపై స్వామి అమ్మవార్లు

పుత్తూరు రూరల్: సుబ్రమణ్యేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం రాత్రి స్వామి అమ్మవార్లు మయూర వాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం స్వామి అమ్మవార్లుకు అభిషేకాలు, విశేషాలంకరణలు చేసి, భక్తులకు దర్శనం కల్పించారు. సాయంత్రం స్వామి అమ్మవార్లు మయూర వాహనంపై పట్టణ పురవీధుల్లో ఊరేగారు. ఇంటింటా కర్పూరహారతులిచ్చారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. కార్యక్రమాలను ఆలయ ధర్మకర్త సుందరం పర్యవేక్షించారు.

నూనె, సబ్బులు పంపిణీ

చిత్తూరు అర్బన్: నగరపాలక సంస్థ పరిధిలో విధులు నిర్వహిస్తున్న పారిశుద్ధ్య కార్మికులకు బుధవారం కొబ్బరి నూనె, సబ్బులు పంపిణీ చేశారు. నగర కమిషనర్ జె అరుణ ఆదేశాల మేరకు, ఎంహెచ్వో లోకేష్, మెప్మా సీఎంఎం గోపి పర్యవేక్షణలో ప్రజారోగ్య విభాగంలో విధులు నిర్వర్తిస్తున్న 510 మంది కార్మికులకు 2022–23 సంవత్సరానికి సంబంధించి ఒక్కొక్కరికి 3.5 లీటర్ల కొబ్బరి నూనె, 10 సబ్బులు అందించారు. కార్మికులకు నూనె, సబ్బులు తదితర వస్తువులను అందించడానికి పలుసార్లు టెండర్లు పిలిచినా, స్పందన లేకపోవడంతో కమిషనర్ అరుణ, జగనన్న మార్ట్ ద్వారా వస్తువులను కార్మికుల అందించడానికి చర్యలు తీసుకున్నారు. కార్మికుల సంక్షేమం, ఆరోగ్య పరిరక్షణ కోసం అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటున్నట్లు కమిషనర్ వివరించారు. త్వరలోనే చెప్పులు పంపిణీ చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, పారిశుద్ధ్య పర్యావరణ కార్యదర్శులు, మేస్త్రీలు పాల్గొన్నారు.

గర్భిణులకు పౌష్టికాహారం



నగరి: పౌష్టికాహారంతో గర్భిణులు

నగరి: ప్రభుత్వాస్పత్రికి పరీక్షల నిమిత్తం వచిన్న గర్భిణులకు బుధవారం రోజా చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో ఉచితంగా పౌష్టికాహారం పంపిణీ చేశారు. చికిత్సల నిమిత్తం ఆస్పత్రికి వచ్చిన గర్భిణులు, వారితో పాటు వచ్చిన పెద్దలు, పిల్లలకు ఉచితంగా వెజిటబుల్ రైస్, గుడ్డు, పుదీనా చట్నీ, చిక్కీ, అరటి పండు, రైతాతో కూడిన పౌష్టికాహారం అందజేశారు. మెడికల్ సూపరింటెండెంట్ బాలకృష్ణనాయక్, ఆర్ఎంఓ గోపాల్, మెడికల్ సూపరింటెండెంట్ రాజారత్నమ్మ గర్భిణులకు భోజనం పంపిణీ చేశారు.



పుత్తూరులో..

పుత్తూరులో..

పుత్తూరు రూరల్: స్థానిక వైద్య విధాన పరిషత్ ఆస్పత్రిలో బుధవారం పరీక్షల నిమిత్తం వచ్చిన గర్భిణులకు 'రోజా చారిటబుల్ ట్రస్ట్' ఆధ్వర్యంలో పౌష్టికాహారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో డాక్టర్ ఉదయ్, మున్సిపల్ చైర్మన్ హరి, వైస్ చైర్మన్ జయప్రకాష్, హాస్పిటల్ డెవలప్‌మెంట్ సభ్యులు నారాయణస్వామి, పుష్పమ్మ, వైఎస్సార్‌సీపీ నాయకులు బుజ్జి, చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

సాగులో మెలకువలు పాటించాలి



వరి పంటను పరిశీలిస్తున్న ఏఓ ఢిల్లీప్రసాద్

పాలసముద్రం: మండలంలోని రైతులు వరి, వేరుశనగ సాగులో మెలకువలు పాటించాలని వ్యవసాయాధికారి ఢిల్లీప్రసాద్ తెలిపారు. బుధవారం శ్రీకావేరిరాజుపురం పంచాయతీ చెరువుముందర కండ్రిగలో పొలంబడి కార్యక్రమం నిర్వహించారు. ఏఓ ఢిల్లీప్రసాద్ మాట్లాడుతూ వరి, వేరుశనగ పంటలకు సేంద్రియ ఎరువులు విరివిగా వాడాలన్నారు. నేల ఆరోగ్యాన్ని కాపాడాలని సూచించారు. వ్యవసాయ శాఖ ద్వారా తీసుకున్న జింక్ సల్ఫేట్ బోరాన్ జిప్సం ఎరువులను సమతుల్యంగా వాడాలన్నారు. అపరాల సాగుతో పంట మార్పిడి చేయాలని తెలిపారు. నేల ఆరోగ్యంగా ఉంటే అధిక దిగుబడి సాధించవచ్చని తెలిపారు. చెరుకు పంటను బిందు సేద్యం పద్ధతిలో సాగు చేసుకోవచ్చని చెప్పారు. డ్రమ్ సీడర్ పద్ధతిలో వరి సాగు చేస్తే కూలీలు, నీటి ఖర్చు తగ్గడంతోపాటు అధిక దిగుబడి సాధించవచ్చని తెలిపారు. అనంతరం రైతులు సాగు చేసిన వరి పంటను పరిశీలించారు. కార్యక్రమంలో వ్యవసాయ సహాయకురాలు వనజ పాల్గొన్నారు.

ప్రథమ చికిత్సతో ప్రాణరక్షణ



గుండెపోటుకు ప్రథమ చికిత్స విధానాన్ని వివరిస్తున్న వైద్యసిబ్బంది

కార్వేటినగరం: అనుకోని ప్రమాదాలు జరిగినప్పుడు, అత్యవసర సమయాల్లో ప్రథమ చికిత్స చేయడంతో ప్రాణాలు కాపాడుకోవచ్చని ప్రభుత్వ డిగ్రీకళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ విజయులురెడ్డి అన్నారు. బుధవారం డిగ్రీకళాశాలలో యూత్ రెడ్ క్రాస్, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ ధనంజయరెడ్డి ఆధ్వర్యంలో ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ, చిత్తూరు కో ఆర్డినేటర్ చిరంజీవి సహకారంతో ప్రాథమిక చికిత్సపై విద్యార్థులకు ఒకరోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న 58 మంది విద్యార్థులకు సర్టిఫికెట్లను అందజేశారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు సీఎన్ లత, వెంకటేశన్, స్వామిశివయ్య, ప్రసాద్, విష్ణుప్రియ, లావణ్య, లోకేశ్వర్ పాల్గొన్నారు.

సైబర్ మోసాలపై అవగాహన కల్పించాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్‌ఐ సురేష్

పాలసముద్రం: సైబర్ మోసాలపై గ్రామాల్లోని ప్రజలకు అవగాహన కల్పించాలని ఎస్‌ఐ బిసురేష్ తెలిపారు. బుధవారం పోలీస్‌స్టేషన్ ఆవరణలో తమ సిబ్బందితో ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. ఎస్‌ఐ మాట్లాడుతూ ఏఎస్‌ఐలు, పోలీస్ కానిస్టేబుళ్లు కలసి మూడు గ్రూప్‌లో విడిపోయి మండలంలోని అన్ని గ్రామాల్లో సైబర్ నేరాలపై ప్రజలను చైతన్యవంతులను చేయాలని చెప్పారు. బ్యాంకు సిబ్బంది అంటూ వచ్చే ఫోన్ కాల్స్‌కు స్పందించి, వ్యక్తిగత, బ్యాంకు వివరాలు చెప్పవద్దని, ఓటీపీ చెబితే ఖాతాలోని నగదు ఖాళీ అవుతుందన్నారు. అలాగే రుణాలు ఇస్తామని సెల్‌ఫోన్లకు వచ్చే సందేశాలకు స్పందించవద్దని తెలిపారు. ముఖ్యంగా గ్రామాల్లో ప్రజలు కలసి మెలసి ఉండాలని, రాజకీయ కక్షలు పెంచుకోవద్దని సూచించాలన్నారు. కార్యక్రమంలో ఏఎస్‌ఐ చక్రవర్తి, మురుగేష్ పాల్గొన్నారు.

పాఠశాలలో వార్షిక తనిఖీ



వార్షిక తనిఖీలో ఎంఈఓ శ్రీదేవి

నగరి: మండలంలోని ఎం.కొత్తూరు మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలను ఎంఈఓ పీఎస్ శ్రీదేవి వార్షిక తనిఖీ చేశారు. బుధవారం ఉదయం పాఠశాలకు వెళ్లిన ఆమె సాయంత్రం వరకు పాఠశాలలో నిర్వహించే ప్రతి కార్యక్రమాన్ని పరిశీలించారు. పిల్లల నోటు పుస్తకాలు, వర్క్ బుక్ కరెక్షన్, అకడమిక్ క్యాలెండర్ ప్రకారం నిర్వహిస్తున్నారా? లేదా అన్న అంశాన్ని గమనించారు. విద్యార్థులు, ఉపాధ్యాయుల హాజరు, సమయపాలనను పరిశీలించారు. మెనూ ప్రకారం మధ్యాహ్న భోజనం అందిస్తున్నారా? పాఠశాల ఆవరణలో పరిశుభ్రతను పరిశీలించారు. సీఈసీ గ్రేడింగ్ రిజిష్టర్ తనిఖీ చేశారు. పరిశీలించిన అంశాలపై సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు శేఖర్, సీఆర్పీ మునస్వామి పాల్గొన్నారు.

విధిగా రక్తపరీక్షలు చేయించుకోవాలి



గర్భిణులకు పరీక్షలు చేస్తున్న వైద్యాధికారి

పాలసముద్రం: మండలంలోని గర్భిణీలు ప్రతి నెలా క్రమం తప్పకుండా రక్తపరీక్షలు చేయించుకోవాలని వైద్యాధికారి మోహన్‌కృష్ణ తెలిపారు. బుధవారం పాలసముద్రం ఆరోగ్య ఉపకేంద్రంలో గర్భిణులకు చేసిన వైద్యపరీక్షలను ఆయన పర్యవేక్షించారు. ఆయన మాట్లాడుతూ చిన్నారులకు వ్యాధి నిరోధక టీకాలు తప్పకుండా వేయించాలన్నారు. మహిళలు ఐరన్, కాల్షియం, విటమిన్లు కలిగిన ఆహారాన్ని ఎక్కువగా తీసుకుంటే సంపూర్ణ ఆరోగ్యం చేకూరుతుందన్నారు. ఆకు కూరలు, పాలు, గుడ్లు తదితర పౌష్టికాహారం తీసుకుంటే మాతాశిశు మరణాలు తగ్గించవచ్చన్నారు. ఆశావర్కర్లు గర్భిణులు ప్రసవం అయ్యే వరకు వారికి సహాయంగా ఉండాలని సూచించారు. ప్రభుత్వాస్పత్రిలోనే ప్రసవం చేయించుకోవాలని చెప్పారు. అనంతరం గర్భిణులు, చిన్నారులకు వైద్యపరీక్షలు నిర్వహించి, మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఏఎన్ఎంలు, ఆశాకార్యకర్తలు పాల్గొన్నారు.

ఘనంగా కుంభాభిషేకం



కుంభాభిషేకంలో పాల్గొన్న మేయర్, ఎమ్మెల్యే సతీమణి

గుడిపాల: మండలంలోని చెరువుముందర వూరు గ్రామంలో వేణుగోపాలస్వామి భజన మందిర కుంభాభిషేకం బుధవారం ఘనంగా నిర్వహించారు. ఉదయం ప్రాణప్రతిష్ఠ, కరన్యాస నాడీసంధ్యానం, అంగన్యాస, నేత్రాన్మలనము, తృతీయపూజాహోమం, సందర్శనహోమం, గోపూజ, మహాపూర్ణాహుతి, కలశ ఉద్వాసన, శిఖర కలశాభిషేకం, అలంకరణ, ధూపదీప నైవేద్యము వేదపండితులతో నిర్వహించారు. అనంతరం తీర్థప్రసాదాలను అందజేశారు. మధ్యాహ్నం భక్తులందరికీ అన్నదానం చేశారు. చిత్తూరు మేయర్ అముద, ఎమ్మెల్యే సతీమణి సత్యవతి, ఎంపీపీ ప్రసాద్‌రెడ్డి, స్థానిక సర్పంచ్ రజినీకాంత్ పాల్గొన్నారు.

ఆర్‌బీఐఎస్‌తో పింఛన్ల పంపిణీ







నగరిలో దివ్యాంగురాలికి పింఛన్ అందజేస్తున్న సిబ్బంది మాధవి, కార్వేటినగరం: మురగమ్మకు పింఛన్ అందిస్తున్న వలంటీర్, పంపిణీ పర్యవేక్షిస్తున్న ఎంపీపీ

నగరి: వేలిముద్రలు, ఐరిస్ పడని వికలాంగులకు పింఛన్లు పంపిణీలో ఎలాంటి ఆటంకాలు ఉండకూడదని ప్రభుత్వం ప్రవేశపెట్టిన రియల్ టైమ్ బెనిఫీషియరీ ఐడెంటిఫికేషన్ సిస్టమ్ (ఆర్‌బీఐఎస్) ద్వారా దివ్యాంగులకు బుధవారం పింఛన్లు అందజేశారు. దీంతో వేలిముద్రలు పడని వారందరూ ఎలాంటి ఆటంకాలు లేకుండా పింఛన్లు అందుకున్నారు.

స్విమ్స్‌కు వెళ్లి..

కార్వేటినగరం: తిరుపతి స్విమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న గోపిశెట్టిపల్లె దళితవాడకు చెందిన వితంతువు మురగమ్మకు వలంటీర్ ఎస్.పయణి బుధవారం తిరుపతికి వెళ్లి పింఛన్ అందజేశారు. ఆపదలో ఉన్న వారికి అండగా నిలుస్తున్న జగనన్నకు ఎప్పుడూ రుణపడి ఉంటామని ఆనందం వ్యక్తం చేసింది.



శ్రీరంగరాజపురం: డయాలసిస్ రోగికి పింఛన్ అందజేస్తున్న సర్పంచ్

డయాలసిస్ రోగికి..

శ్రీరంగరాజపురం: డయాలసిస్‌తో బాధపడుతున్న రోగికి ప్రభుత్వం పింఛన్ రూపంలో అందించిన రూ. 10 వేలు నగదును బుధవారం సర్పంచ్ వరదమ్మ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వృద్ధులకు, వితంతువులకు, వికలాంగులతో పాటు డయాలసిస్‌తో బాధపడుతున్న వారిని గుర్తించి పింఛన్ పంపిణీ చేస్తున్నారని అన్నారు.

పింఛన్ పంపిణీ పరిశీలన

పుత్తూరు రూరల్: మండలంలోని వేపగుంటలో బుధవారం పింఛన్ పంపిణీని ఎంపీపీ మునివేలు పర్యవేక్షించారు. ఆమె మాట్లాడుతూ ప్రతి నెలా పింఛన్ పంపిణీపై ఆరా తీశారు. ప్రతి నెలా ఒకటో తేదీనే పింఛన్ అందుతోందా? అంటూ అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ గిరిజాప్రసాద్, సచివాలయ కన్వీనర్లు నరసింహులు, పుష్పలత, వార్డు సభ్యురాలు కవిత తదితరులు పాల్గొన్నారు.

క్రీడా వికాసం

- క్రీడాభివృద్ధికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యత
- క్రికెట్‌లో ప్రత్యేక శిక్షణా శిబిరం ప్రారంభం



చిన్నారులకు క్రికెట్ శిక్షణ ఇస్తున్న కోచ్

నగరి: క్రీడల అభివృద్ధికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తోంది. గ్రామ స్థాయిలో ప్రతిభ గల క్రీడాకారులను గుర్తించడంతో పాటు వారిని వెలుగులోకి తీసుకొచ్చేందుకు చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా స్థానిక కేవీకే మైదానంలో ఏపీ క్రీడా ప్రాధికార సంస్థ (శాప్) పర్యవేక్షణలో క్రికెట్‌లో శిక్షణ ఇస్తున్నారు. రెండేళ్లుగా జిల్లాలో ఎక్కడ చూసినా క్రీడా సంబరాలు జరుగుతున్నాయి. ఇప్పటికే జిల్లా స్థాయి స్కూల్ గేమ్స్ క్రీడాపోటీలు, ఏపీ సీఎం కప్, జగనన్న క్రీడా పోటీలు జరుగుతున్నాయి. క్రీడలను, క్రీడాకారులను ప్రోత్సహించడమే లక్ష్యంగా ఈ పోటీలు నిర్వహిస్తున్నారు. గతంలో జిల్లా స్థాయిలో ఏదైనా క్రీడలో ప్రత్యేక గుర్తింపు తెచ్చుకుంటే తప్ప ప్రోత్సాహం ఉండేది కాదు. ఇప్పుడు క్రీడలపై ఆసక్తి ఉన్న ప్రతి ఒక్కరినీ ప్రోత్సహిస్తున్నారు. దీంతో జిల్లా నుంచి పలువురు రాష్ట్ర, జాతీయ స్థాయిలో రాణిస్తున్నారు.

శాప్ ఆధ్వర్యంలో క్రికెట్ శిక్షణ

క్రికెట్ ఆడాలన్న ఆసక్తి ఉన్న క్రీడాకారులకు స్థానిక కేవీకే మైదానంలో ఉచితంగా శిక్షణ అందించే ప్రక్రియను ప్రభుత్వం ప్రారంభించింది. నైపుణ్యం ఉన్న శాప్ కోచ్‌లు ఎన్ఐఎస్, 'ఎ' లెవల్, 'ఓ' లెవల్ కోచ్‌లు క్రీడాకారులకు క్రికెట్ శిక్షణ ఇస్తారు. శిక్షణకు అవసరమైన మౌలిక సదుపాయాలు కూడా కల్పించారు. క్రికెట్ శిక్షణ ఇవ్వడంతో పాటు ఆటపై అవగాహన, జట్ల ఏర్పాటు, బయట ప్రాంతాలకు తీసుకెళ్లి మ్యాచ్‌లు ఆడించడంతో పాటు వారికి ఫిట్‌నెస్ వ్యాయామాలు, యోగాలోను శిక్షణ ఇస్తున్నారు. పాఠశాలలకు వెళ్లే విద్యార్థులు వారి విద్యాభ్యాసానికి ఎలాంటి ఆటంకం కలగకుండా ఉదయం 5.45 నుంచి 8.30 గంటల వరకు సాయంత్రం 4.30 నుంచి 6 గంటల వరకు ఈ శిక్షణ ఇస్తున్నారు.

క్రీడలకు పెద్దపీట



ప్రభుత్వం క్రీడలకు పెద్దపీట వేస్తోంది. గతంలో క్రికెట్ కోచింగ్ తీసుకోవాలంటే తిరుపతి, చెన్నై లాంటి ప్రాంతాలకు వెళ్లి అక్కడున్న క్లబ్బుల్లో రూ.వేలకు వేలు వెచ్చించి శిక్షణ పొందాల్సి ఉండేది. ప్రభుత్వ ప్రోత్సాహం, మంత్రి ఆర్కేరోజా సహకారంతో క్రికెట్ శిక్షణ వారున్న ప్రాంతానికే అందుబాటులోకి వచ్చింది. ఈ శిక్షణలో చేరడానికి ఎలాంటి ఫీజులు లేవు. నిర్వహణ వ్యయం కింద అతి తక్కువ రుసుము మాత్రమే వసూలు చేస్తారు. అత్యున్నత కోచింగ్ ఇస్తారు. ఇది శుభపరిణామం.

– బాబు, శాప్ కోచ్, నగరి

క్లుప్తంగా

వాహనాల వేలం రేపు

పుత్తూరు రూరల్: వివిధ కేసుల్లో సీజ్ చేసిన ద్విచక్ర వాహనాలను ఈ నెల 4వ తేదీన పుత్తూరు స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో(ఎస్‌ఈబీ) కార్యాలయంలో బహిరంగ వేలం వేయనున్నట్లు సీఐ కృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10.30 గంటలకు వేలం పాట ప్రారంభమవుతుందని, ఆసక్తి గల వారు పాల్గొనవచ్చని పేర్కొన్నారు.

విస్తారంగా పొద్దుతిరుగుడు సాగు



పన్నూరులో సాగు చేసిన పొద్దుతిరుగుడు పంటను పరిశీలిస్తున్న ఏఓ రజని

నగరి(విజయపురం): మండలంలోని రైతులు పొద్దుతిరుగుడు పంటను విస్తారంగా సాగు చేశారు. పన్నూరు, జగన్నాథపురం, సూరికాపురం, కాళికాపురం, గంగమాంబపురం తదితర గ్రామాల్లో సాగు ఎక్కువగా ఉంది. ఈ ఏడాది మొత్తం 107 ఎకరాల్లో పొద్దుతిరుగుడు పంట సాగు చేశారు. గత ఏడాది కంటే సుమారు 30 ఎకరాల సాగు పెరిగిందని వ్యవసాయాధికారి రజని తెలిపారు.

నేడు గూడూరులో మహాసభ

పుత్తూరు రూరల్: వీధి వ్యాపారుల సమస్యల పరిష్కారం కోసం శుక్రవారం తిరుపతి జిల్లా స్థాయి మహాసభను గూడూరులో నిర్వహించనున్నట్లు పుత్తూరు వీధి విక్రయదారుల సంఘ గౌరవాధ్యక్షుడు మహేష్ ఒక ప్రకటనలో తెలిపారు. వీధి వ్యాపారుల కోసం 2014లో తీసుకొచ్చిన చట్టాన్ని క్రమబద్ధీకరించడం, రోజువారీ వసూళ్ల పేరిట దోపిడీని అరికట్టడం తదితర సమస్యల పరిష్కారంపై సభలో తీర్చించి, తీర్మానాలు చేయడం జరుగుతుందని తెలిపారు. అనంతరం కార్యాచరణను రూపొందించడం జరుగుతుందని చెప్పారు. సమస్యల పరిష్కారం కోసం నిర్వహిస్తున్న మహాసభలో ప్రతి వీధి విక్రయదారుడు పాల్గొని, విజయవంతం చేయాలని కోరారు.

రైతులకు నాణ్యమైన విద్యుత్



లైన్ల మరమ్మతు పనులు పరిశీలిస్తున్న ఏఈ

శ్రీరంగరాజపురం: వేసవికాలం దృష్ట్యా రైతులు, ప్రజలకు నాణ్యమైన విద్యుత్ అందించడమే లక్ష్యంగా విద్యుత్ శాఖ పనిచేస్తుందని ట్రాన్స్‌కో ఏఈ గిరి అన్నారు. ఈ సందర్భంగా మండలంలోని సమస్యాత్మకమైన ప్రాంతాల్లో ట్రాన్స్ ఫార్మర్, విద్యుత్ లైన్ల మరమ్మతు పనులు చేస్తున్నామని ఎస్సీ, ఎస్టీ, రైతులకు ఉచిత కనెక్షన్‌తో పాటు మూడు విద్యుత్ స్తంభాలు, 180 మీటర్ల విద్యుత్ తీగలు సరఫరా చేస్తామన్నారు. అలాగే ఎస్సీ, ఎస్టీ, గృహాలకు రూ.45 చెల్లిస్తే విద్యుత్ కనెక్షన్ మంజూరు చేసి, 200 యూనిట్ వరకు విద్యుత్ ఉచితంగా సరఫరా చేస్తారని తెలిపారు.

గజ వాహనంపై సుబ్రమణ్యేశ్వరస్వామి



పుత్తూరురూరల్: సుబ్రమణ్యేశ్వరస్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం రాత్రి స్వామిఅమ్మవార్లు గజవాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం స్వామి అమ్మవార్లకు అభిషేకాలు, విశేషాలంకరణ చేసి, భక్తులకు దర్శనం కల్పించారు. సాయంత్రం స్వామి అమ్మవార్లు గజ వాహనంపై పురవీధుల్లో దర్శనమిచ్చారు. ఇంటింటా కర్పూర హారతులిచ్చారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. కార్యక్రమాలను ఆలయ ధర్మకర్త సుందరం పర్యవేక్షించారు.

సాయిబాబాకు విశేష పూజలు



వెదురుకుప్పం: మండలంలోని టీకేఎం పురంలో ఉన్న సాయిబాబా మందిరంలో గురువారం విశేష పూజలు చేశారు. ఈ సందర్భంగా వేకువజామున బాబాకు కాగడ హారతి, కర్పూర హారతులిచ్చి, నిత్యకైంకర్యాలు నిర్వహించారు. తరువాత భక్తిశ్రద్ధలతో బాబాకు పాలాభిషేకం చేశారు. ఉభయకర్తలు తెచ్చిన సుగంధభరిత పుష్పాలతో బాబాకు విశేషాలంకరణ చేసి, ప్రత్యేక పూజలు చేశారు. మధ్యాహ్నం హారతి అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. సాయంత్రం బాబాను పుష్పపల్లకిపై ఊరేగించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని, బాబాను దర్శించుకున్నారు.

రైతు(కు) భరోసా కేంద్రం

- సేవలు మరింత చేరువ
- ప్రతి ఆర్బీకేకి ఒక వలంటీర్ నియామకం
- ఇకపై నిరంతరాయంగా సేవలు

కష్టాల సేద్యం నుంచి కర్షకులను గట్టెక్కించేందుకు రాష్ట్ర ప్రభుత్వం పలు పథకాలను అమలు చేసింది. పల్లె వాకిటే పుడమి పుత్రులకు సేవలు అందుబాటులోకి తేవడానికి రైతు భరోసా కేంద్రాలను ఏర్పాటు చేసింది. ఆ కేంద్రాల సేవలు మరింత మెరుగుకు ఇటీవల ఆర్బీకే వలంటీర్ వ్యవస్థను కూడా ఏర్పాటు చేసింది. ఫలితంగా అన్నదాతలకు అన్ని వేళలా సేవలు అందుబాటులోకి వచ్చాయి. రైతుకు మరింత భరోసా కల్పిస్తోంది ఆ కేంద్రం.



శ్రీకావేరిరాజుపురంలోని రైతు భరోసా కేంద్రం

పాలసముద్రం: రాష్ట్ర ప్రభుత్వం అన్నదాతల సర్వతోముఖాభివృద్ధికి కృషి చేస్తోంది. విత్తనం నుంచి పంట విక్రయం వరకు వ్యవసాయానికి కావాల్సిన అన్ని రకాల సేవలను అందిస్తోన్న రైతు భరోసా కేంద్రాలు మరింత బలోపేతమయ్యేలా చర్యలు తీసుకుంది. ఎలాంటి అంతరాయం లేకుండా రైతులకు సేవలు అందించేందుకు విప్లవాత్మక మార్పునకు శ్రీకారం చుట్టింది. ప్రతి రైతు భరోసా కేంద్రానికి ఓ వలంటీర్‌ను నియమిస్తూ గత ఏడాది సెప్టెంబర్‌లో చరిత్రాత్మక నిర్ణయం తీసుకుంది. ఆర్బీకేల కోసం నియమించిన వలంటీర్లకు వ్యవసాయానికి సంబంధించి గత నెలలో తిరుపతి జిల్లాలోని శ్రీకాళహస్తిలో శిక్షణ కూడా ఇచ్చారు. ఫలితంగా రైతు భరోసా కేంద్రాల్లో సేవలు రైతుకు మరింత చేరువ కానున్నాయి.

మండలం పేరు		ఆర్బీకేల సంఖ్య
గంగాధరనెల్లూరు	-	23
శ్రీరంగరాజుపురం	-	13
కార్వేటినగరం	-	13
వెదురుకుప్పం	-	13
పెనుమూరు	-	14
పాలసముద్రం	-	9

ఇన్‌ఛార్జిలుగా వీఏఏ, వీహెచ్ఏ, ఏఎస్ఏలు

రైతు భరోసా కేంద్రాల ఇన్‌చార్జిలుగా గ్రామ వ్యవసాయ సహాయకుడు (వీఏఏ), గ్రామ ఉద్యాన సహాయకుడు (వీహెచ్ఏ), గ్రామ సెరికల్చర్ సహాయకుడు (వీఎస్ఏ) ఉన్నారు. అయితే వారు క్షేత్రస్థాయికి వెళ్లినప్పుడు ఆర్బీకే సేవలకు అంతరాయం కలుగుతోంది. ఈ–క్రాప్ బుకింగ్ కోసం రోజుల తరబడి పొలాల వెంట తిరగాల్సిన పరిస్థితి వస్తోంది. ఆ సమయంలో ఆర్బీకేల వద్ద సేవలకు అంతరాయం కలగకూడదన్న ఉద్దేశంతో ఆర్బీకేలకు వలంటీర్లను నియమిస్తూ ఆదేశాలు జారీ చేసింది. దీంతో రైతులకు నిరంతరం సేవలు అందనున్నాయి.

జీడీ నెల్లూరు నియోజవర్గంలో 85 ఆర్బీకేలు

గంగాధరనెల్లూరు నియోజకవర్గంలో 85 రైతు భరోసా కేంద్రాలున్నాయి. ప్రతి రైతు భరోసా కేంద్రానికి ఇంటర్ పూర్తయిన ఓ వలంటీర్‌ని నియమించారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఏర్పాటైన వెంటనే ప్రతి 50 ఇళ్లకు ఓ వలంటీర్‌ను నియమించారు. వారిలోనే ఇంటర్ బయాలజీ పూర్తి చేసిన వారికి రైతు భరోసా కేంద్రాల బాధ్యతలు అప్పజెప్పారు. నియోజకవర్గంలో 230 రైతు భరోసా కేంద్రాలకు వలంటీర్లను నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.

వలంటీర్లకు శిక్షణ పూర్తి



వలంటీర్ల నియమక ప్రక్రియతోపాటు వారికి శిక్షణ కూడా పూర్తయింది. డిజిటల్ కియోస్క్ ద్వారా ఎరువులు, విత్తనాలు, పురుగు మందులకు ఆర్డర్ పెట్టడం, పంపిణీ చేయడం తదితర అన్ని కార్యక్రమాలు ఆర్బీకే ఇన్‌చార్జుల పర్యవేక్షణలో వలంటీర్లు చేపడతారు. వలంటీర్ల రాకతో ఆర్బీకే సేవలు రైతులకు మరింత చేరువ కానున్నాయి.

–ఢిల్లీప్రసాద్, ఏఓ, పాలసముద్రం

శుభ పరిణామం



ప్రతి రైతు భరోసా కేంద్రానికీ వలంటీర్‌ను నియమించడం శుభపరిణామం. దీంతో ఆర్బీకే సేవలు రైతులకు మరింత చేరువ అవుతాయి. వ్యవసాయ సహాయకులు లేని సమయంలో రైతులకు అన్ని సేవలు అందించడానికి ఈ నిర్ణయం తీసుకోవడంతో మాకు మేలు కలిగింది. ఆధునిక యంత్ర పరికరాలు అందించడం హర్షణీయం.

–కే రాజేంద్రన్, రైతు, శ్రీకావేరిరాజుపురం

అందుబాటులో ఉంటాం



రైతు భరోసా కేంద్రాల్లో రైతులకు అందుబాటులో ఉంటాం. ప్రభుత్వం ప్రతి రైతు భరోసా కేంద్రానికి ఇంటర్ పూర్తయిన ఓ వలంటీర్‌ను నియమించారు. రైతులకు ఎలాంటి సేవలు చేయాల్సిన బాధ్యతలు, ఇతర అంశాలపై మాకు శిక్షణ కూడా ఇచ్చారు. రైతులకు, అంతరాయం లేకుండా సేవలు చేస్తాం.

–కే దొరైమురుగన్, వలంటీర్, ఆర్బీకే

శిశుసంరక్షణపై అవగాహన పెంచుకోండి



మాట్లాడుతున్న ఆరోగ్యవిద్యాధికారి రాజేంద్రప్రసాద్

గంగాధరనెల్లూరు: గర్భిణులు, నవజాత శిశు సంరక్షణపై అవగాహన పెంచుకోవాలని ఆరోగ్యవిద్యాధికారి రాజేంద్రప్రసాద్ తెలిపారు. మండలంలోని కొత్తవెంకటాపురం పంచాయతీ దొడ్డిపల్లెలో గురువారం నవజాత శిశుసంరక్షణపై అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ బిడ్డ పుట్టినప్పుడు రెండున్నర కిలోల కన్నా తక్కువ ఉంటే నవజాత శిశు సంరక్షణ యూనిట్‌లో ఉంచి, ప్రత్యేక చికిత్స అందజేస్తామన్నారు. బరువు పెరిగిన తరువాత ఇంటికి పంపిస్తారన్నారు. గర్భిణులు అంగన్‌వాడీ కేంద్రాల్లో ఇచ్చే పౌష్టికాహారం తప్పనిసరిగా భుజిస్తే రక్తహీనత లేకుండా ఉంటుందన్నారు. డాక్టర్ సూచనలతో చిన్న వ్యాయామాలు చేయాలన్నారు. గర్భిణులు ఆస్పత్రుల్లోనే ప్రసవాలు చేయించుకోవాలన్నారు. బిడ్డలకు వ్యాధి నిరోధక టీకాలు వేయించాలని కోరారు. బిడ్డలకు తల్లిపాలు పట్టించాలన్నారు. ఈ కార్యక్రమంలో తూగుండ్రం సీహెచ్ఓ వరలక్ష్మి, ఏఎన్ఎంలు కామాక్షి, రేణుక పాల్గొన్నారు.

కమనీయం.. కల్యాణం



కల్యాణోత్సవంలో పాల్గొన్న ఉభయకర్తలు

శ్రీరంగరాజపురం: మండలంలోని మంగుంటలో ఉన్న లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం స్వామివారి కల్యాణోత్సవం వైభవంగా నిర్వహించారు. ఉదయం 6 గంటలకు సుప్రభాతం, అభిషేకం, మహా మంగళహారతి తీర్థ ప్రసాద వినియోగం చేశారు. 9 గంటలకు యాగశాల ఆరాధన, గణపతి పూజ, అంకురార్పణ హోమం జరిపారు. అనంతరం శాస్త్రోక్తం గా స్వామివారి కల్యాణోత్సవం ఘనంగా చేశారు. భక్తులకు అన్నదానం, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఉత్సవాలకు మోహన్‌రెడ్డి, నాగమ్మ, శేషాద్రి, ఝాన్సీ ఉభయకర్తలుగా వ్యవహరించారు. ఆలయ ధర్మకర్త ప్రసాద్‌రెడ్డి, అర్చకులు వెంకటాచలపతి అయ్యర్ తదితరులు పాల్గొన్నారు.

పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం



మాత్రలు మింగిస్తున్న సీహెచ్‌ఓ శ్రీనివాసులు

గంగాధరనెల్లూరు: పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని జీడీనెల్లూరు పీహెచ్‌సీ సీహెచ్‌ఓ శ్రీనివాసులు తెలిపారు. మండలంలోని పెదకంటిపల్లె జెడ్పీ ఉన్నత పాఠశాలలో గురువారం విద్యార్థులకు రక్తహీనతపై అవగాహన కల్పించారు. సీహెచ్‌ఓ మాట్లాడుతూ రక్తహీనత ఉంటే విద్యార్థుల్లో పెరుగుదలకు, విద్యకు అవరోధం కలుగుతుందన్నారు. రక్తహీనతను అధిగమించేందుకు పౌష్టికాహారంతో పాటు ఆల్బెండజోల్ మాత్రలు మింగాలన్నారు. దీంతో కడుపులో ఉన్న నులిపురుగులు చనిపోయి రక్తహీనత లేకుండా ఉంటుందన్నారు. విద్యార్థులు వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలన్నారు. అనంతరం ఐరన్‌ఫోలిక్ మాత్రలు పంపిణీ చేశారు. హెచ్ఎం దామోదరనాయుడు, ఏఎన్ఎంలు కోకిల, హేమలత తదితరులు పాల్గొన్నారు.

మండల సమావేశం వాయిదా

పుత్తూరు రూరల్: ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున మండల సర్వసభ్య సమావేశం వాయిదా వేస్తున్నట్లు ఎంపీడీఓ ఇందిర తెలిపారు. గురువారం మండల కార్యాలయంలో ఎంపీపీ మునివేలు అధ్యక్షతన ప్రారంభమైన సమావేశాన్ని వెంటనే వాయిదా వేస్తున్నట్లు ఆమె ప్రకటించారు.

పోలింగ్ స్టేషన్ తనిఖీ



వడమాలపేట పోలింగ్ స్టేషన్ పరిశీలిస్తున్న డీఎస్పీ రామరాజు

వడమాలపేట: మండలకేంద్రంలోని జెడ్పీ హైస్కూలులో ఏర్పాటు చేసిన ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ కేంద్రాన్ని పుత్తూరు డీఎస్పీ రామరాజు గురువారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్సీ ఎన్నికలను ప్రశాంతంగా, సమర్థవంతంగా నిర్వహించాలని ఆదేశించారు. ఓటర్లు సులభంగా ఓటు వేసేలా ఏర్పాట్లు చేయాలని సూచించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా తగు ఏర్పాట్లు చేయాలన్నారు. మండలంలో 824 మంది పట్టభద్రులు, 65 మంది ఉపాధ్యాయ ఓట్లు ఉన్నాయని వారికి అసౌకర్యంగా కలగకుండా ప్రత్యేక క్యూలు, తాగునీటి వసతి కల్పించేలా ఏర్పాట్లు చేస్తున్నామని తహసీల్దార్ సుబ్రమణ్యం తెలిపారు. ఈ కార్యక్రమంలో సీఐ సురేష్, ఎస్ఐ రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

మూడు రంగుల డస్ట్‌బిన్ల పంపిణీ



డస్ట్‌బిన్లు పంపిణీ చేస్తున్న సిబ్బంది

నగరి: మున్సిపాలిటీలోని కృష్ణానగర్‌లో గురువారం మూడు రంగుల డస్ట్‌బిన్లను మున్సిపల్ సిబ్బంది పంపిణీ చేశారు. పచ్చరంగు బుట్టను తడిచెత్తకు, నీలం రంగు బుట్టను పొడిచెత్తకు, ఎరుపు రంగు బుట్టను ప్రమాదకర చెత్తకు వినియోగించాలని నివాసితులకు సూచించారు. ప్రతిరోజు చెత్తసేకరణకు విచ్చేసే సిబ్బందిని ఆయా రంగుల్లో ఉన్న వ్యర్థాలను సిబ్బంది తెచ్చే రంగుల బుట్టల్లో వేయాలన్నారు. చెత్తనే వేర్వేరుగా బుట్టల్లో వేసి మున్సిపల్ సిబ్బందికి అందించి, సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ వెంకటరత్నం రెడ్డి, శానిటేషన్, ఎన్విరాన్‌మెంట్ కార్యదర్శి అజయ్, మేస్త్రి శేఖర్, వలంటీర్ మురళి, పారిశుద్ధ్య సిబ్బంది సాము, శోభన తదితరులు పాల్గొన్నారు.

రైతులకు సేవలందిస్తాం



మాట్లాడుతున్న రైతు చిన్నస్వామిరెడ్డి

వెదురుకుప్పం: రైతులకు అన్ని రకాలా సేవలు అందిస్తామని అంకురం స్వచ్ఛంద సంస్థ చైర్మన్ జయరామయ్య అన్నారు. గురువారం మండలంలోని జక్కిదొనలో రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సహకార భారతి ఆధ్వర్యంలో రైతు ఉత్పత్తిదారుల సంస్థలను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. తద్వారా రైతులకు మార్కెట్ సౌకర్యం, ఆర్గానిక్ ఎరువుల పంపిణీ, విత్తనాలు పంపిణీతోపాటు సాంకేతిక సహకారం అందిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. స్థానిక రైతు చిన్నస్వామి రెడ్డి మాట్లాడుతూ అంకురం సంస్థ చేస్తున్న సేవలతో రైతులు వ్యవసాయంపై మరింత పట్టు సాధించాలన్నారు.

ఘనంగా పీరియాడిక్ టేబుల్ డే

వెదురుకుప్పం: మండలంలోని చవటగుంటలోని డాక్టర్ వైఎస్సార్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గురువారం జాతీయ పీరియాడిక్ టేబుల్ డేను ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ అన్నపూర్ణశారద మాట్లాడుతూ పీరియాడిక్ టేబుల్‌లో మూలకాలను క్రమపద్ధతిలో అమర్చడంతో రసాయన శాస్త్ర అధ్యయనం ఎంతో సులువు అయ్యిందన్నారు. మానవాళికి ఉపయోగ పడే ఎన్నో ఆవిష్కరణలు జరిగినట్లు చెప్పారు. ప్రఖ్యాత రష్యన్ శాస్త్రవేత్త డిమిత్రి మెండలీఫ్ పీరియాడిక్ టేబుల్‌కు తుది రూపాన్ని ఇచ్చినట్లు చెప్పారు. అనంతరం వైస్ ప్రిన్సిపల్ ప్రభాకర్‌రావు మాట్లాడుతూ విశ్వంలోని ప్రతి పదార్థం రసాయన పదార్థమని, రసాయన శాస్త్ర అధ్యయనం చేస్తే విశ్వాన్ని అధ్యయనం చేసినట్లేనని పేర్కొన్నారు. విద్యార్థులు రసాయన శాస్త్రంలో పట్టు సాధిస్తే భవిష్యత్‌లో ఉన్నత స్థాయికి చేరుకునే ఆస్కారం ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో ఐక్యూసీ కో–ఆర్డినేటర్ వెంకటేశ్, వైఆర్సీ కో–ఆర్డినేటర్ శంకర్‌రెడ్డి, అధ్యాపకులు పాల్గొన్నారు.

నేడు మండల మీట్

వెదురుకుప్పం: మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం మండల సాధారణ సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ సుధాకరరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశానికి ప్రజాప్రతినిధులతో పాటు అన్ని శాఖల అధికారులు తప్పకుండా హాజరు కావాలని ఆయన కోరారు.

అభివృద్ధిని కళ్లు తెరిచి చూడు లోకేష్



వరద వెంకటేశ్వరస్వామి ఆలయ నిర్మాణాన్ని పరిశీలిస్తున్న మంత్రి

కార్వేటినగరం: 'లోకేష్ బాబూ..గంగాధర నెల్లూరు నియోజకవర్గంలో జరిగిన అభివృద్ధిని కళ్లు తెరిచి చూడు. అభివృద్ధి జరగలేదని మీరు నిరూపిస్తే నేను రాజకీయ సన్యాసం తీసుకుంటా. అభివృద్ధి జరిగినట్లు నేను నిరూపిస్తే తండ్రీ కొడుకులు రాజకీయాల దూరం కావడానికి మీరు సిద్ధమా?' అని డిప్యూటీ సీఎం నారాయణస్వామి సవాల్ విసిరారు. గురువారం గంగాధర నెల్లూరు నియోజకవర్గం స్థాయిలో జరిగిన అభివృద్ధి పనులను అధికారులతో పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిశ్శంకదుర్గం, వెంకటాద్రిపురం, డీఎం పురం, కేఎం పురం, కనికాపురం, గోపిశెట్టిపల్లె గ్రామాలకు స్వాతంత్ర్యం పూర్వం నుంచి దారి వసతి లేదని, దీంతో ఆయా గ్రామాల ప్రజలు ఇబ్బందులు పడుతున్నా 14 ఏళ్లు సీఎంగా ఉన్న చంద్రబాబు ఎందుకు పట్టించుకోలేదని ప్రశ్నించారు. అధికారం చేపట్టి మూడున్నరేళ్లలోనే నియోజకవర్గ అభివృద్ధి కోసం రూ.వేల కోట్లు వెచ్చించామన్నారు. గంగాధరనెల్లూరు నియోజకవర్గంలో అభివృద్ధి జరగలేదని లోకేష్ చెప్పడం దారుణమన్నారు. తాను అక్రమంగా 400 ఎకరాలు సంపాదించానని చెబుతున్న లోకేష్, దాన్ని నిరూపిస్తే, సీఎంతో చర్చించి, ఆ భూమిని లోకేష్ పేరిట రాసిస్తానన్నారు. ఇకనైనా లోకేష్ ప్రభుత్వంపై విషప్రచారం చేయడం మానుకోవాలని, లేని పక్షంలో ప్రజలే తగిన గుణపాఠం చెబుతారని హెచ్చరించారు. పత్రికలు నిజాలను నిర్భయంగా రాయాలని, మరొకరికి దాసోహం కాకూడదని అప్పుడే ఆ పత్రికకు ప్రజల్లో గుర్తింపు వస్తుందన్నారు. మంత్రి వెంట వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి బాలాజీ, కోఆప్షన్ సభ్యుడు పట్నం ప్రభాకర్‌రెడ్డి, నాయకులు ఏలుమలై(అమ్ములు), భాస్కర్‌రెడ్డి, నారాయణరాజు, రవిశేఖర్‌రాజు, పద్మనాభరెడ్డి , కాశప్ప ఉన్నారు.

అర్హులందరికీ ఇళ్ల స్థలాలు

వెదురుకుప్పం: అర్హత ఉన్న పేదలందరికీ ఇళ్ల స్థలాలు మంజూరు చేయిస్తానని ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి అన్నారు. గురువారం సాయంత్రం మండలంలోని కొత్తగా ఆధునికీకరించిన నచ్చుకూరు, సంతబయలు గ్రామాలకు వెళ్లే రోడ్లను పరిశీలించారు. జగనన్న ప్రభుత్వంలో రోడ్లు కళకళలాడుతున్నాయన్నారు. 70 ఏళ్లుగా అభివృద్ధికి నోచుకోని రోడ్లు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో కొత్త రూపు సంతరించుకున్నాయని పేర్కొన్నారు. నచ్చుకూరు యానాదులకు అటవీ శాఖ అధికారులతో మాట్లాడి ఇళ్ల స్థలాలు ఇప్పించేందుకు చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేసిన సంక్షేమ పథకాలన్నీ అందుతున్నాయా? లేదా అని అడిగి తెలుసుకున్నారు. పేదల సంక్షేమం కోసం ఎవరూ చేయని విధంగా పథకాల రూపకల్పన చేసినట్లు తెలిపారు. ఆయన వెంట వైఎస్సార్‌సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి బండి హేమసుందర్‌రెడ్డి, బీసీ సెల్ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి బట్టె సుబ్రమణ్యం, జిల్లా ప్రధాన కార్యదర్శి కామసాని పద్మనాభరెడ్డి, మండల కన్వీనర్ ధనంజయరెడ్డి, నాయకులు నారాయణరెడ్డి, పెద్దిరెడ్డి, ప్రకాష్, విక్కీదాదా ఉన్నారు.

నీరాజనం



వెదురుకుప్పంలోని నచ్చుకూర్ ఎస్సీ కాలనీలో నూతనంగా ఏర్పాటు చేసిన సీసీ రోడ్డును పరిశీలించేందుకు గురువారం ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి ఆ కాలనీకి వచ్చారు. గతంలో ఏ ప్రభుత్వ హయాంలో తమకు సీసీ రోడ్లు వేసిన దాఖలాలు లేవంటూ ఉప ముఖ్యమంత్రికి స్థానిక మహిళలు హారతి నీరాజనాలు పట్టేందుకు వచ్చారు. ఇది గమనించిన ఉప ముఖ్యమంత్రి వారి చేతిలో ఉన్న హారతి పళ్లెం తీసుకుని 'అమ్మా.. నాకు కాదు హారతి.. మీరు మా ఆడపడుచులు.. మీకే పట్టాలి..' అంటూ ఆ మహిళలకు నారాయణస్వామి హారతులు పట్టారు. దీంతో మహిళలు సంబరపడిపోయారు. –వెదురుకుప్పం

పేర్నాటికి భారీ మెజారిటీని అందిద్దాం



విజయపురంలో కరపత్రాలు పంపిణీ చేస్తున్న కుమార్‌స్వామిరెడ్డి

నింద్ర: ఎమ్మెల్సీ ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ బలపరచిన తూర్పు రాయలసీమ పట్టభద్రుల అభ్యర్థి పేర్నాటి శ్యామ్ ప్రసాద్‌రెడ్డికి భారీ మెజారిటీని అందిద్దామని మంత్రి రోజా సోదరుడు కుమారస్వామి రెడ్డి పిలుపునిచ్చారు. గురువారం మండల కేంద్రమైన నింద్రలో గ్రాడ్యుయేట్లను కలిసి ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారాన్ని చేశారు. ఈ కార్యక్రమంలో యువజన విభాగం రాష్ట్ర కార్యదర్శి శ్యామ్‌లాల్, ఎంపీపీ దీప, అనిల్, మండల కన్వీనర్ వేణురాజు, ఆర్బీకే మండల కన్వీనర్ వీరయ్య, సచివాలయ మండల కన్వీనర్ బాబురెడ్డి, సోషియల్ మీడియా మండల కన్వీనర్ వెంకటేష్, నాయకులు కోడండరామిరెడ్డి, సంపత్, విజేష్ తదితరులు పాల్గొన్నారు.

శ్యామ్‌ప్రసాద్‌రెడ్డిని గెలిపించాలి

విజయపురం: పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి శ్యామ్ ప్రసాద్‌రెడ్డిని గెలిపించాలని మంత్రి ఆర్కే రోజా సోదరుడు కుమార్‌రెడ్డి పిలుపునిచ్చారు. గురువారం విజయపురంలో ఆయన ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం చేశారు. ఆయన వెంట పార్టీ మండల కన్వీనర్ గోపినాథ్, నేతలు ప్రసన్న, బాలకృష్ణమనాయుడు, భాస్కర్‌రాజు, మురళీరెడ్డి, రమేష్, తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి పనుల్లో నాణ్యతా ప్రమాణాలు తప్పనిసరి



కూలీలతో మాట్లాడుతున్న ఏపీడీ సుబ్రమణ్యం

పాలసముద్రం: మండలంలో జరుగుతున్న ఉపాధి హామీ పనుల్లో నాణ్యతా ప్రమాణాలు తప్పనిసరని ఏపీడీ సుబ్రమణ్యం తెలిపారు. గురువారం గంగమాంబపురంలో అమృత్ సరోవర్ పథకంలో భాగంగా నీటికుంట పనులను ఆయన పరిశీలించారు. ఏపీడీ సుబ్రమణ్యం మాట్లాడుతూ రోజుకూలీ రూ.257 రావాలంటే విధిగా రెండు పూటలా రోజుకు 8 గంటలు పనిచేయాలన్నారు. పనులు నాణ్యతగా చేయించాల్సిన బాధ్యత సంబంధిత ఫీల్డ్ అసిస్టెంట్లపై ఉందని చెప్పారు. ప్రస్తుతం ఎండల ఎక్కువగా ఉన్నందున పనులు జరిగేచోట తప్పకుండా నీడ వసతి కల్పించాలని తెలిపారు. ప్రతి పంచాయతీలో కూలీల సంఖ్య పెంచకపోతే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో టెక్నికల్ అసిస్టెంట్ భూపతి, రంగనాథం పాల్గొన్నారు.

పేదల సొంతింటి కల సాకారమే ధ్యేయం



మాట్లాడుతున్న పీడీ పద్మనాభం

పాలసముద్రం: పేదల సొంతింటి కల సాకారం చేయడమే రాష్ట్ర ప్రభుత్వ ధ్యేయమని హౌసింగ్ పీడీ పద్మనాభం తెలిపారు. గురువారం మండలంలోని కన్నికాపురం, పాలసముద్రం, సన్నగుంట గ్రామాల్లోని జగనన్న లేఅవుట్లను ఆయన పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం జగనన్న లేఅవుట్లలో లబ్ధిదారులు గృహనిర్మాణాలను త్వరగా పూర్తి చేయాలన్నారు. ప్రభుత్వం ఉచితంగా ఇసుక, తక్కువ ధరకు సిమెంట్, సకాలంలో బిల్లులు ఇస్తుందని చెప్పారు. జగనన్న కాలనీల్లో తాగునీరు, విద్యుత్, రోడ్లు తదితర వసతులు కల్పనలో ట్రాన్స్‌కో అధికారులు, ఇంజినీరింగ్ అసిస్టెంట్లు అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ఇళ్ల నిర్మాణాల పురోగతిపై ఆరా తీశారు. ఈఈ శంకరప్ప, డీఈ వెంకటేశ్వర్, ఏఈ మధు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు



సంఘటన స్థలంలో గుమికూడిన స్థానికులు

పాలసముద్రం: ఆర్టీసీ బస్సు, ద్విచక్రవాహనాన్ని ఢీకొనడంతో ఓ వ్యక్తికి తీవ్రగాయాలైన సంఘటన గురువారం మండలంలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. బలిజకండ్రిగకు చెందిన ఆర్ముగం(32) తన అత్తగారి ఊరు శ్రీకావేరిరాజుపురం నుంచి స్వగ్రామానికి బయలు దేరాడు. శ్రీకావేరిరాజుపురం శివార్లలో వెళుతుండగా కత్తిరికుప్పం–బెంగళూరు ఆర్టీసీ బస్సు అదుపుతప్పి అతడిని ఢీకొంది. దీంతో ఆర్ముగం కిందపడి తీవ్రంగా గాయపడ్డాడు. గ్రామస్తులు సంఘటనా స్థలానికి చేరుకుని బాధితుడి కుటుంబసభ్యులకు ఫోన్ చేసి, సమాచారం అందజేశారు. దీంతో అతడి బంధువులు అక్కడికి చేరుకుని, క్షతగాత్రుడిని శోళింగర్ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. బాధితుడి మామ మునస్వామి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ సురేష్ తెలిపారు.